క్లుప్తంగా

దాతలు అభినందనీయులు



మాట్లాడుతున్న దొంతు శారద

ఆత్మకూరు: పట్టణంలో గ్రంథాలయ నిర్వహణకు భవనాన్ని బహూకరించిన దాతలు దివంగత దోర్నాదుల రామిరెడ్డి, సుబ్బమ్మలు వారి కుటుంబ సభ్యులు అభినందనీయులు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద అన్నారు. ఆ భవనాలను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వానికి నివేదికను అందజేసినట్లు త్వరలోనే నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార రాజా, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి, తెలుగు భారతి సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఎస్ సుబ్బరాయుడు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గండ్లవేడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2 కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బాలాజీనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నవాడ సచివాలయం పరిధిలోని 7 గ్రామాల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోళ్ల మృతితో కలకలం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి చికెన్ దుకాణానికి తెచ్చిన కోళ్లలో సోమవారం కొన్ని మృతి చెందడంతో స్థానికంగా కలకలం రేగింది. గత కొద్ది రోజులుగా జిల్లాతో పాటు సమీప తిరుపతి జిల్లా పరిధిలో బర్డ్‌ఫ్లూ ప్రబలడంతో కొన్ని రోజులు చికెన్ దుకాణాలను మూసివేశారు. తాజాగా చికెన్ దుకాణానికి తెచ్చిన కోళ్లు భారీ సంఖ్యలో మృతి చెందడంపై స్థానికంగా ఆందోళన మొదలైంది. బర్డ్‌ఫ్లూతోనే కోళ్లు మృతి చెందాయని అనుమానం నెలకొంది. అయితే ఈ విషయమై స్థానిక పశు వైద్యాధికారి రాజేష్‌ను సంప్రదించగా ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవని చెప్పారు. ఒత్తిడికి గురైన కోళ్లు మృతి చెంది ఉంటాయని పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

చేజర్ల: మండలంలోని టీకేపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో చేజర్ల డాక్టర్ గిరీష్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. నలుగురు గర్భిణులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, గ్రామాల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఆకుకూరలు, ప్రొటీనులు ఉండే ఆహార పదార్థాలు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిమేల్ హెల్త్ వర్కర్ ఈ మస్తానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ టి ఆశా, ఆశ వర్కర్లు పద్మ, వరలక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



ముత్తుకూరు: చిన్నపిల్లలు విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కరెంట్ అఫైర్స్ డిప్యూటీ సెక్రటరీ బుడిగి శ్రీనివాసులురెడ్డి సూచించారు. గోపాలపురంలోని ఆదాని వరల్డ్ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు విశేషమైన కృషి చేయాలన్నారు. సమస్యలు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఖాళీ సమయాల్లో మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఎంఈఓలు మధుసూదన్, హేమసుందర్, ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విక్రమా.. విజయీభవ



టీడీపీకి పట్టున్న మురగళ్లలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి మంగళ హారతులతో ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఊరూరా జన నీరాజనం.. మంగళహారతులతో స్వాగతం
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ఊరూరా విజయసిద్ధి రస్తూ అంటూ ఆశీర్వాదాలు అందించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సోమవారం మండలంలోని పమిడిపాడు, నబ్బీనగరం, మురగళ్ల గ్రామాల్లో విజయీభవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పార్టీలకు అతీతంగా తరలివచ్చి నీరాజనం పలికారు. ప్రధానంగా గతంలో టీడీపీకి బలమైన ఓటింగ్ ఉన్న మురగళ్ల, పమిడిపాడు గ్రామాల్లో సైతం స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, విక్రమ్‌రెడ్డిపై చూపిన ప్రజాదరణ టీడీపీ నేతలను పునరాలోచనలో పడేసింది. మురగళ్లకు చెందిన దివంగత ప్రజా వైద్యురాలు డాక్టర్ వింజం దొరసానమ్మ అల్లుడు, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ప్రణీత్‌చౌదరి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ పువ్వాడి హరిత, ఆమె భర్త శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ నేత తోడేటి అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. స్థానికులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంతోషంగా ఉన్నామని, మళ్లీ మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నామని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలన తర్వాత అన్నివర్గాల ప్రజలందరూ జగనన్నకే మద్దతు తెలుపుతున్నారంటూ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో ఆత్మకూరులో నాకు భారీ మెజార్టీ వచ్చేలా, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం మురగళ్లలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.40 లక్షలతో పూర్తయిన సిమెంట్ రోడ్లు, సైడ్‌కాలువలు, డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మురగళ్ల యావత్తు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వెంట నడిచి తమ సంఘీభావం తెలిపారు. పమిడిపాడులో స్థానిక సర్పంచ్ సతీష్, మాదాల రాజానాయుడు, తదితరుల ఆధ్వర్యంలో మేకపాటి విజయీభవ యాత్ర నిర్వహించగా, నబ్బీనగరంలో బోయలచిరివెళ్ల పంచాయతీ సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, పంచాయతీ నాయకులు రావూరు శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. నబ్బీనగరంలో నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ కొలను పథకంతో పాటు వైఎస్సార్ జలకళ ద్వారా రైతులకు అందించిన 36 బోర్లు, రోడ్లు, డ్రైనేజీలు, తదితరాలను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా జగనన్న కాలనీలు, పింఛన్లు, తదితర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, మాజీ సర్పంచ్ రావూరు రత్నాకర్ రెడ్డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

మునుసూరు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి



అండర్ పాస్‌లతో ప్రమాదాల నియంత్రణ

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రమాదాలు అరికట్టేలా ఒకే రోజు దేశమంతా సుమారు 450 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించడం అభినందనీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి మండలం ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మంగళవారం హాజరయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో అండర్ పాస్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల కారణంగా సమీప గ్రామాల ప్రజలు గేటు దాటేందుకు ఇబ్బందులు పడటం, గేటు వేసిన సమయంలో సమయం వృథా కావడంతో పాటు తరచూగా ప్రమాదాల బారిన కూడా పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని నివారించేలా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రయాణికుల సమయాన్ని ఆదా చేసేలా దేశమంతా ఒకేసారి వర్చువల్ పద్ధతిలో ప్రధాని నరేంద్రమోదీ 450 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కావలి నియోజకవర్గంలో కూడా కొత్తగా నాలుగు అండర్ పాస్‌లు మంజూరైనట్లు తెలిపారు. ముసునూరు జగనన్న కాలనీ వద్ద, చౌదరిపాళెం గేటు వద్ద, సాయిబాబా మందిరం నుంచి ఇందిరానగర్ వెళ్లే మార్గంలో, రుద్రకోట వద్ద అండర్ పాస్‌లు మంజూరైనట్లు వివరించారు. బోగోలులోని 144వ నంబరు రైల్వేగేటు వద్ద ఫ్లై ఓవర్ మంజూరైనా అనివార్య కారణాలతో జాప్యం ఏర్పడిందన్నారు. ఈ గేటు కారణంగా స్థానికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారని, రైల్వే అధికారులు త్వరితగతిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రైల్వే ప్రగతితో పాటు నాలుగు పోర్టులు, 11 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సహకరించిన ప్రధానికి, పోర్టులు, హార్బర్ల నిర్మాణాన్ని యజ్ఞంలా భావించి పూర్తి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, వైఎస్సార్‌సీపీ కావలి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వాణిజ్య విభాగాల అధ్యక్షుడు కనుమర్లపూడి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అభివృద్ధి విఘాతకుడు



మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి
- అట్టహాసంగా విజయ సంకల్ప యాత్ర

కలిగిరి: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకొని చెబుతున్న కల్లబొల్లి మాటలను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు హయాంలో గ్రామాలు, పట్టణాల్లో సామాజిక అభివృద్ధే కాకుండా ప్రజలు సైతం అభివృద్ధి చెందలేదన్నారు. చంద్రబాబు అభివృద్ధి విఘాతకుడని దుయ్యబట్టారు. మండలంలోని పోలంపాడు, ఏపినాపి, రావులకొల్లు పంచాయతీల్లో సోమవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. తొలుత రాజగోపాల్‌రెడ్డికి, యువనేత అభినవ్‌రెడ్డికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, భారీ ఊరేగింపు మధ్య విజయ సంకల్పయాత్ర కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ వలంటీర్ల ద్వారా ప్రతి గ్రామంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేస్తూ నిర్వీర్యం చేయడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల ఆదరణ మెండుగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో పర్యటించిన సందర్భంలో గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించామన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనరు సీహెచ్ సుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకట సత్యనారాయణ, స్థానిక నాయకులు నర్రావుల అంకిరెడ్డి, బాపతు శ్రీనివాసులురెడ్డి, ఆముదం పిచ్చిరెడ్డి, నల్లపనేని ప్రసాద్, కూసాల అక్కపునాయుడు, యలపల తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే చంద్రబాబు దుష్ప్రచారం

జలదంకి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాడని, వారు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీనే అని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాళెంలో సోమవారం ఆయన విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం జగన్‌ను ప్రతి కుటుంబం కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించే పాలన కావాలంటే టీడీపీ, జనసేనను వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలన్నారు. మార్చి 3న బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగే సిద్ధం మహాసభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి, సర్పంచ్ సుబ్బరత్తమ్మ, సొసైటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రసాద్ నాయుడు, సతీష్‌నాయుడు, మస్తాన్‌రెడ్డి, ఎరుకల రెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బొట్టా మాలకొండయ్య, సురేష్‌రెడ్డి, వెంకటకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

జగనన్న పాలనకు జనం ఫిదా



పార్టీలో చేరిన వారితో మేకపాటి, తదితరులు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- టీడీపీని వీడి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మేకపాటి

వరికుంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చూసిన జనం పార్టీలకు అతీతంగా ఫిదా అవుతున్నారని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన అందరికి సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. సోమవారం వరికుంటపాడు పంచాయతీలోని జంగంరెడ్డిపల్లె, భాస్కరాపురం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షుడు పి.మల్లికార్జున, ఎస్.నాగరాజు ఆధ్వర్యంలో రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మేకపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ విజయానికి కలిసికట్టుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తాను గెలిచిన వెంటనే మొదటగా వరికుంటపాడు–జంగంరెడ్డిపల్లి రోడ్డు నిర్మాణం చేపడుతానని హామీ ఇచ్చారు. తన దృష్టికి గ్రామస్తులు తెచ్చిన సమస్యలన్నీ పరిష్కరించి తీరుతానన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగని విధంగా జగనన్న పాలనలో రాష్ట్ర అభివృద్ధి జరగడంతో పాటు ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సంపూర్ణంగా నెరవేర్చిన ఘనత జగనన్నదన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వాటి ఫలాల ప్రజల ముంగిటకు తెచ్చారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. అనంతరం పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, జగనన్న పాలనపై సంతృప్తితో మేకపాటి కుటుంబంపై ఉన్న అభిమానం, నమ్మకంతో పార్టీలో చేరామన్నారు. పార్టీ గెలుపునకు తాము పాటు పడతామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన కె.ఆంతోనిబాబు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాజగోపాల్‌రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, నాయకులు ఎం.తిరుపతినాయుడు, ఎం.శ్రీనివాసులు, బి.మురళీ, డి.ఎర్రా ఓబయ్య, ఏ రామిరెడ్డి, సీహెచ్ సుందరం, యేసు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా నెహ్రూ యువ కేంద్రం సహకారంతో లాయల్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్–2024 కార్యక్రమం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు.

వాలీబాల్, ఖోఖో పోటీల్లో విజేతలైన విన్నర్, రన్నర్స్‌కు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏ నరసింహులు, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రసాద్, విజయమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: దేవిరెడ్డి శారదమ్మ 7వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. ఆయనతో పాటు మరో 90 మంది రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భరత్



భరత్‌రెడ్డి

ఆత్మకూరు: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన చింతలపల్లి భరత్‌రెడ్డిని సోమవారం ఎంపిక చేశారు. భరత్‌రెడ్డి జిల్లా బీజేవైఎం కార్యవర్గంలో బాధ్యత వహిస్తుండగా, అతన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడినిగా ఎంపిక చేయడంతో పలువురు అభినందించారు.

ఇవే తనకు చివరి ఎన్నికలు

అల్లూరు: రానున్న ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. సోమవారం అల్లూరులోని తన నివాసంలో అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తాను ఒక పార్టీ గుర్తుపైనే పోటీ చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. అది ఏ పార్టీ అనేది రెండు.. మూడు రోజుల్లోనే ప్రకటిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

ఉదయగిరి: మార్చి 1 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్–2 ప్రశ్న పత్రాల బండిల్స్ సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ప్రత్యేక వాహనంలో వచ్చిన ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్, సూపరింటెండెంట్ అధికారులు ఏ రమణ, పి.కమల్‌హాసన్ సరిచూసుకుని ట్రంక్ పెట్టెల్లో పెట్టి సీల్ వేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరచారు. వారు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ఈ పరీక్ష కేంద్రంలో 355 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.



బండిల్స్ సరిచూసుకుంటున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

సోమశిల: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు, వీఆర్‌ఓలతో తహసీల్దారు నరసింహారావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వారికి పలు సూచనలు చేశారు. వీఆర్‌ఓలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ అధికారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ గిరీష్, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు నరసింహారావు

అంగవైకల్య రహిత సమాజానికి కృషి



జాతీయ టీకాల దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: మార్చి నెల 3, 4, 5 తేదీల్లో జాతీయ వ్యాధి నిరోధక టీకాల దినోత్సవాలు నిర్వహించనున్నట్లు, భవిష్యత్‌లో అంగవైకల్య రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు చిన్నారులకు టీకాలు తప్పనిసరి అని ఆత్మకూరు, మహిమలూరు పీహెచ్‌సీల డాక్టర్లు షేక్ అస్మా, అనూషా అన్నారు. జరగనున్న టీకాల కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సమష్టిగా చేయాల్సిన కార్యక్రమం కావడంతో సోమవారం వారికి అవగాహన సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలకు సీడీపీఓ కార్యాలయంలో, ఉపాధ్యాయులకు అర్బన్ హెల్త్ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఈ టీకాల అప్పుడే పుట్టిన చిన్నారి మొదలుకుని ఐదేళ్లలోపు వారందరికి వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయాలన్నారు. బాధ్యతగా టీకాల కార్యక్రమం నిర్వహించి జయప్రదం చేయాలని డాక్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, సీడీపీఓ సునీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.